అత్తా సోడికోడలీయం

ఆరోజే తిరుపతివెళ్లి వెంకన్నను చూసి రావాలని పట్టుబట్టారు మా అత్తగారు.

పని తీరికలేని మావారు "పై వచ్చేవారం వెళ్దాంలేమ్మా"—అన్నారు ఆఫీసుకు బయలుదేర్తూ.

"అపచారంరా అపచారం—" అంటూ రెండు చెంపలూ వాచిపోయేట్టు బాదుకున్నారు మా అత్తగారు తన సొంత చేతుల్తో.

నాకు నవ్వొచ్చింది—కాని మరుక్షణం అపచారం అంటూ నాచేతివేళ్లు కూడా రెండు చెంపలూ మృదువుగా తాకాయి.

"మరేవిటంటావురా!" అన్నారు మడిలో వున్న మా అత్తగారు మర్చిపోయి వాకిలి కేసినకర్టెన్ ముట్టుకొని నేను చూసేలోగానే దూరంగా జరుగుతూ.

"పోనీ ఒకపని చెయ్యమ్మా. నీవూ నీకోడలూ వెళ్ళిరండి. ఇంకోసారి అందరం కలిసి వెళ్లొచ్చు" అన్నారు మావారు.

"హయ్యొ సత్తిరాతా నీవులేకుండా ఎట్టారా వెళ్లడం! అపచారంరా అట్టా అనకూడదూ" అంటూ దీర్ఘం తీశారు మా అత్తగారు.

"మరేం చేయమంటావమ్మా! అర్జంట్ పనులన్నీ యీవాళే వున్నాయి, ఇంకో వారం రోజులదాకా నే నెక్కడికీ కదలడానికి వీల్లేదు—అయినా నువ్వు యీవాళే తిరుపతి ప్రయాణం అవుతావని నే నేం కలగన్నానా!"

"అవున్రోయ్ కలంటే జ్ఞాపకం వచ్చింది రాత్రి వెంకన్న నాకల్లో కనిపించాడ్రా. ఎట్టా వచ్చాడనుకున్నావ్! మన పక్కింటి పురుషోత్తమాచార్లు లేడూ, ముసలాయన, ఆయనలాగా వచ్చాడ్రా. ఒంటినిండా నామాలతో, వెండి పొన్ను వేసిన కర్ర ఒకటి చేత బట్టుకుని వాకిట్లో కొస్తూనే" అమ్మణీ! అంటూ ఒక్క కేకేశాడ్రా. ఓ యమ్మ, యిదేమిటి ముసలాయన కింత కోపం వచ్చిందనుకుంటూ, వంటింట్లో వంట చేస్తున్నదాన్నల్లా చేతులోవున్న తప్పేలా ఆపళంగా అక్కడే పడేసి, హాల్లోకి పరుగెత్తుకొచ్చాను. ఆ అన్నట్లు, ఆహాలు మళ్ళీ మన యీ హాల్లాగా లేదు, ఆ వంటిల్లూ మన యీ వంటిల్లుగాదు. మా తాతగారి యింట్లో వుండే వంటింటిలాంటిదినీ, మా పెత్తండ్రి వాళ్ళింటి హాల్లాంటిదీని కనిపించాయిరా."

"ఏదోకటిలేమ్మా—త్వరగా చెప్పు—పోవాలి—" అన్నారు అప్పుడే టిఫిన్ తిని ఆయాసపడుతున్న మావారు.

"అపచారంరా, అట్టాఅనకు ఆ నామాల ముసలాయని ఎవరోకాదురా; వెంకన్నే సాక్షాత్తూ ఆ వడ్డికాసులవాడే అట్టా వచ్చాడ్రా! ఇంతకూ ఏమైందనుకున్నావ్! నన్ను చూస్తూనే, ఆ ముసలాయన మండిపడుతూ 'ఏం అమ్మణీ! నీకండ్లు నెత్తి కెక్కినట్టున్నయ్యే! నన్ను చూట్టానికి రావడం బొత్తుగా మానేశావే! నేనొకణ్ణి వున్నా

భానుమతీ రామకృష్ణ

★ అత్తా తోడికోడలీయం ★

నన్నమాటే మర్చిపోయావే! ఇంత పొగరా నీకు అంటూ చేతులోవున్న కర్రతో నా నెత్తిమీద బాదడం మొదలెట్టాడ్రా.

తలంతా బొప్పెలు కట్టిందంటే నమ్మ. కల్లోనే అనుకుంటానట; చూశావా, నేను తిరుపతి రాలేదన్న కోపంతో వెంకన్నే యీవిధంగా వచ్చి దండిస్తున్నాడు అని.”

అని మా అత్తగారంటుంటే మావారు పక్కుననవ్వి “భక్తేదేవుడే మొత్తానికి. తన్ను చుట్టానికి రాకపోతే తన్ని రప్పించుకుంటున్నాడు” అన్నారు.

“అపచారంరా! వెంకన్నతో వేళాకోళాలేమిట్రా! వెంకన్నంటే ఏమనుకున్నావ్, తప్పంటే చెప్పు తీసుకుని కూడా తంతాడ్రా. వెనకటికి మా అత్తగార్ని వెండిచెప్పుతో కొట్టాట్ట కల్లో కనబడి. మంచి వేళ, మడిలో వున్నాను గనక, చేతికర్రతోనే వాసెత్తి చితగ్గొట్టాడా వడ్డికాసుల వాడు. మరి కొట్టాడంటే కొట్టడుట్రా! మనం తిరుపతివెళ్ళి దగ్గిర దగ్గిర ఏడాది కావచ్చిందా కట్టిన ముడుపులన్నీ అట్లాగే పేరకుపోయ్యాయి. మరి ఆయనకు మాత్రం కోపం వచ్చిందంటే రాకేంజేస్తుంది. చూశాడు చూశాడు; తనే పక్కా బయల్దేరొచ్చాడు నాకు బుద్ధి చెప్పడానికి. అందుకే యీరోజు ఏమైనా సరే వెళ్ళి తీరాలనుకున్నాను. తీరా వెళ్దామనుకుని వెళ్ళకపోతే స్వామికి మళ్ళీ ఏం కోపం వస్తుందోనని భయంగా వుందిరా.”

“సరే నీవు తప్పనిసరిగా యీరోజే వెళ్ళాలంటే, మీ అత్తాకోడళ్ళిద్దరూ వెళ్ళి రావల్సిందే. నేను ఆఫీసులో దిగి కారు పంపుతాను. మధ్యాన్నం భోజనాలయ్యాక బయల్దేరి వెళ్ళండి; పని పిల్లవాణ్ణి కూడా తీసుకుని” అంటూ వెళ్ళి కార్లో కూర్చున్నారు మావారు.

“అయితే యింతకూ నువ్వు రావన్నమాటేగా.”

“ఆహా, మీ వెంకన్నకు కోపం వచ్చినా సరే.”

“అపచారంరా ఏం మాట్రలా అవీ.”

“మరి నన్నేం చేయమంటావమ్మా! ముఖ్యంగా యీ వేళా రేపూ నేను కదలడానికి వీల్లేనన్ని పన్లున్నాయి. అబద్ధం గాదు.”

“సరే ఏంజేస్తాం! వెంకన్నకే నిన్ను కొంపకు రప్పించుకోవాలని వుంటే ఆ పన్లన్నీ మధ్యాన్నం లోపుగానే పూర్తి కాకూడదూ!”

“అవునవును. అన్నట్లు వెంకటేశ్వర స్వామి బిజినెస్ దేవుడేగా! నా పన్లన్నీ మధ్యాన్నంలోగా పూర్తిచేస్తాడేమో చూడాలి.”

“తప్పక పూర్తిచేస్తాడ్రా వెంకన్న రాత్రి నాకల్లో వచ్చినట్లు తనే వచ్చి ”

“తల చితగ్గొడతాడు బాబోయ్. వద్దు ఆయన అంతపని చేయకుండానే, నేను కొండ కొస్తానని చెప్పు. కాని యీరోజు కాదు..”

“అబ్బ ఆమాటే అనకురా అపచారం.”

“సరే అనన్లే. అనుకుంటూను—”అంటూ లెంపలేసుకున్నారు మావారు.

“సరే నీయిష్టం. అంతా వాడిదయ. నువ్వు రానందుకు అపరాధకానుక హుండీలో వేస్తాను——”

“ఆ. అపనేదో చెయ్యమ్మా. అలాంటి సదుపాయాలన్నీ నాలాంటి వాళ్ళకోసం ఆదేవుడు ముందే ఏర్పాటుచేశాడుగా!” అంటూ కారు స్టార్టు చేసి ఆఫీసుకెళ్ళిపోయారు మావారు.—

తిరుపతి ప్రయాణానికి అన్ని ఏర్పాట్లూ చేసి, పెందరాడే భోజనం ముగించింది మా అత్తగారు. మావారుకూడా రాలేదన్న నిరుత్సాహంతో నేను నాలుగు మెతుకులు తిని, విధిలేక మా అత్తగారివెంట బయల్దేరాను. మావారు కారు పంపించారు పెట్రోలు గట్రా వేయించి. తిరుపతి వెళ్ళుతున్నామని తెలియంగానే, డ్రైవరుకూడా తనపెళ్ళాం పిల్లల జబ్బుల బాపతు, ఎన్నాళ్ళనుండో ‘స్టాక్’లోవున్న ముడుపులూ, పిల్లల తల మీద శాస్త్రానికి వేసిన కత్తెరబాపతు తల వెంట్రుకలూ, అన్నీ కలిపి ఒక చిన్న కిరసనాయిల్ డబ్బాలోపెట్టి తెచ్చుకుని ముందు సీట్లో తనపక్కనే పెట్టుకున్నాడా డబ్బా—

ఆ ముడుపుల డబ్బా మీద ఏలాంటి సామాను పెట్టనివ్వకుండా కాపాడుకోడానికి అవస్థపడిపోయాడు డ్రైవర్. ముందు సీట్లో ఆ డబ్బాపక్కనే మా మళయాళం పని పిల్లవాడుకూడా వచ్చి కూర్చున్నాడు. అంతటితో ఆగక వాడు బట్టలుపెట్టి తెచ్చుకున్న తోలుసంచీ ఆ ముడుపుల డబ్బా మీద పెట్టాడు. డ్రైవర్ ప్రాణం విలవిలకొట్టుకుంది. తక్షణం ఆ తోలుసంచితీసి సీటుకింద పడేస్తూ, “అది స్వామిముడుపుల డబ్బా. ఇది తోలుసంచి—అపచారం—”అంటూ సగం అభినయంతోనూ, సగం వచ్చీరాని అరవ మాటల్తోనూ మెల్లిగా చెప్పాడు డ్రైవర్.

అసలు మా డ్రైవర్ కూ, మళయాళంపని



పిల్లవాడికి ఎప్పుడూ సరిపడదు. "పిన్ని వ్యాన్ యింద బ్యాగ్ ఎంగ వెక్కణుం! తలె మేలెయో!" అంటూ డ్రైవర్ మీద మండిపడ్డాడు మళయాళం.

"ఉన్నీ—అరవక—అమ్మగారొస్తున్నారు" అంటూ కారుదగ్గిరికెళ్ళిన నన్ను చూపించాడు డ్రైవర్. మళయాళం నోరు మూశాడు—

మా అత్తగారు, వెనకవైపున్న వంటిల్లూ, వడ్లకొట్లూ, స్టోరుగదీ, పూజామందిరంవున్న గదీ అన్నీ నెంబర్లవారీగా తాళాలేసుకుని, సహారా ఎడారి భూదానం యిచ్చినట్లు, వంటింటి ముందున్న వసారానుమాత్రం వంటవాడికి వదిలేసి, తోటవాడికి యింటిభద్రం అంతా చెప్పి, వర్షం వచ్చేట్లయితే గొడ్లను కొట్టంలో కట్టేయమని చెబుతూవచ్చి కార్లో కూర్చున్నారు, ముశుపులు పెట్టిన తాటాకు బుట్టతో సహా. ఈ లోపుగా మేడ మీద గదులన్నిటికీ తాళాలేసుకొని వెళ్ళి కార్లో కూర్చున్నాను.

"మరి తాళాలు అబ్బాయికిచ్చివెళ్ళొద్దూ" అన్నారు మా అత్తగారు.

"వెళ్ళే దోవలోనేగా ఆఫీసు! ఇచ్చి వెడదాం" అన్నాను. కారు బయలుదేరింది.

కొంతదూరం వెళ్ళినతర్వాత మా అత్తగారు కూర్చున్నవైపు కారుటైరు 'ఢాం' అంటూ బ్రహ్మాండమైన మోతతో పంచరయింది, "ఓయమ్మ ఏమిటే ఆ మోత," అంటూ హడలిపోయి నన్ను గట్టిగాపట్టుకున్నారు మా అత్తగారు—నవ్వానా! నవ్వకుండా వుండనా!—"అబ్బే ఏంలేదత్తా—టైరు పంచరైం" దన్నాను—నవ్వాపుకుంటూ—"మరెట్లాగూ యిప్పుడు! అబ్బాయికూడా రాలేదే!" అన్నారు మా అత్తగారు ఖంగారుపడుతూ.

"వేరే టైరుంటుంది కార్లో—మార్చుకుంటాడు మనం కాసేపు కారుదిగాలి," అన్నాను—

"అట్లాగా!" అంటూ కారుదిగారు మా అత్తగారు నాతోబాటూ.

"అయినా ముందున్న పాతబస్సే నయం, యీకొత్తకారుకంటే ఎన్నడయినా ఆబస్సు యిట్లా 'ఢాం'అంటూ పేలిందా"—

మా అత్తగారు చెప్పేబస్సు మా పాత ఫోర్డువేన్. అది ఆమె అభిమానాన్ని చూరగొన్న బస్సు.

డ్రైవర్ టైరు మార్చుకున్నాడు. తిరిగి కార్లో కూర్చున్నాం.

అసలే మధ్యాహ్నం ప్రయాణం—అలవాట్లేక తలనొప్పి పట్టుకుంది. దానికితోడు మా అత్తగారు నేనెరగని తన పుట్టింటి వాళ్ళను గురించీ, వాళ్ళకు సంబంధించిన బంధువులు తిరుపతిలో ఎంతమందివున్నారో వాళ్ళను గురించీ, వాళ్ళలో తనతో మాటలేని వాళ్ళెంతమందో, తనంటే పడిచచ్చే వాళ్ళెంతమందో, వాళ్ళందర్నీ గురించీ చెప్పి నా తలనొప్పి మరికాస్త ఎక్కువ చేసింది. నిజంగానే తిరుపతిలో మా అత్తగారి బంధువు లెక్కువగానే వున్నారు. ఎవళ్ళింటికెళ్ళి, ఎవళ్ళింటికెళ్ళకపోయినా చిక్కే. అందుకే మావారొస్తే టైమ్ లేదనే సాకుతో నేరుగా కొండకెళ్ళి స్వామి దర్శనం చేసుకొని తిరిగి వచ్చేస్తుంటారు. కొడుకు వెంటవచ్చినప్పుడు మా అత్తగారు కూడా నోరెత్తరు. కాని నేను యీసారి ఆమెచేతుల్లో చిక్కాను. ఆమె ఎక్కడికి తీసుకెడితే అక్కడికి వెళ్ళాలి వచ్చినట్లు. మావారు వాళ్ళ పెదనాన్న యింటికెళ్ళి, వాళ్ళన్నయ్యను పిల్చుకొని కొండకు వెళ్ళమని చెప్పారు. నిజంగానే మా బావగార్నీ, తోడికోడల్నీ చూసి చాలాకాలమయింది. మనవడుపుట్టాక వెళ్ళనేలేదు. నామకరణానికి రాలేదని ఎంతో నిష్ఠూరంగా జాబు వ్రాసింది మా తోడికోడలు. మావారు వాళ్ళ పెదనాన్న యింటికెళ్ళమన్నప్పుడు, మా అత్తగారు సరే అన్నారేగాని తీరా తిరుపతి దగ్గరకొచ్చేసరికి. "ఏమే మరి మా సరోజ యింటికెళ్ళి యీ రాత్రి వుండి, తెల్లారుగట్ల బయలుదేరి కొండకెళదమూ! దాన్ని చూసి చాలారోజులైంది— 'ఏం" అన్నారు. సరోజ మా అత్తగారి పెద్దక్క మనవరాలు—ఒద్దని నేనెట్లా చెప్పేది!

"మరి మీ అబ్బాయి బావగారింటికి వెళ్ళమన్నారు," అని గొణిగాను మెల్లిగా.

"ఆ, వాడంటానికేం లెస్తూ—నీకు తెలీందేముంది చెప్పూ...పైగా ఆమధ్య నీ తోడికోడలికి పెద్ద జబ్బు చేసిందనీ, మంచంలోంచి లేవడం లేదనీ జాబు రాశాడుగా నరం...! మరి యిప్పుడెట్లావుందో!... ఇంత రాత్రప్పుడు మనం వెళ్ళి జబ్బుమనిషిని దాన్ని అవస్థపెట్టడం ఎందుకూ!... దానికోడలు యిక్కడే వుందో లేక పుట్టింటికెళ్ళిందో. అంతగా అయితే కొండదిగి వచ్చేప్పుడు చూసి వెళ్దాంలే... ఏమంటావ్!" అన్నారు మా అత్తగారు. ఏమంటాను! "సరే మీ యిష్టం" అన్నాను.

కారు సరోజ యింటిముందాగింది. సంతోషంగా కారు దిగబోతున్న అత్తగారు ఆగిపోయారు, బ్రేక్ వేసినట్లు. సరోజ యింటివాకిలికి తాళంవేసుంది. కారు ఆగడం చూసి బయటికొచ్చిన పక్కింటివాళ్ళు చెప్పారు, సరోజ మొగుడికి ట్రాన్స్ఫర్ అయిందనీ, నెలరోజులక్రితమే తాడిపత్రివెళ్ళిపోయారనీ.

★ అత్తా తోడికోడలియం ★

మా అత్తగారి ముఖం వెలవెలబోయింది. నాముఖం చూడలేకపోయింది. "పోనీ శకుంతల వుందేమో చూసి పోదాములే! దగ్గిరేగా!..." అన్నారు మా అత్తగారు.

"అలాగే" అన్నాను. శకుంతల మా తోడికోడలికి తోడికోడలున్నూ, మా అత్తగారి పుట్టింటి ఆడబడుచున్నూ. మా తోడికోడలంటే సరిపడకపోయినా శకుంతలంటే ప్రాణాలిస్తుంది మా అత్తగారు.

కారు శకుంతల యింటిముందు ఆగింది— మళ్ళీ మా అత్తగారు కారు దిగబోతూ ఆగిపోయారు—శకుంతల యింటివాకిలిక్కూడా తాళం వేసుంది. మళ్ళీ ఆ పక్కింటివాళ్ళే చెప్పారు—పురిటికి పుట్టింటి కెళ్ళిందనీ, ఆవిడభర్త వాళ్ళ అన్నగారింట్లోనే వుంటున్నాడనీ. మా అత్తగారి ముఖాన కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు.

"ఏడ్చినట్టేవుంది"... అని కాసేపు విసుక్కున్నారు మా అత్తగారు.

"ఊఁ సరే... ఏంజేస్తాం!... మా తోడికోడలింటికే పోదాంపద" అన్నారు మా అత్తగారు నీరసంగా. నా ప్రాణం లేచొచ్చింది.

మా తోడికోడలింటి ముందు కారాగింది. యీసారి మా అత్తగారు బిగుసుకుపోయి కూర్చున్నారు. నేనే ముందు కారుదిగాను. నన్ను చూస్తూనే మా బావగారు ఎక్కడలేని సంతోషంతో యింట్లోంచి పరుగెత్తుకొచ్చారు కారు దగ్గిరికి.

"రామ్మా—ఎన్నాళ్ళకు కనిపించావు—కార్లో ఎవరు? 'కక్కా!' ఏం కక్కా కార్లోనే కూర్చున్నావ్! లోపలికి రా. ముది మనవణ్ణి చూద్దువుగాని—ఏమిటో మీ రంతా మమ్మల్ని బొత్తుగా మర్చిపోయారు... అన్నట్టు తమ్ముడు రాలేదేం!"

"అర్జంటుపనులున్నాయని ఆగిపోయారు"

"అట్లాగా! ఆ. వాడికెప్పుడూ అర్జెంట్ పనే. యిదుగో—డ్రైవర్! కారు తీసుకెళ్ళి, వీథిచివరున్న వియ్యన్నగారింటి షెడ్లో పెట్టు. అబ్బాయ్! ఆ సామానన్నీ లోపలికి తీసుకెళ్ళు నాయనా!" అని మళ్ళీ యాళంతో చెప్పి "రాండి కక్కా!" అంటూ మమ్మల్ని లోపలికి పిల్చుకెళ్ళారు మా బావగారు.

"ఏమేవ్ మా కక్కా, మీ చెల్లెలూ వచ్చారేవ్... త్వరగా రా..." అంటూ వంటింట్లోవున్న మా తోడికోడల్ని కేకేశారు మా బావగారు.

"ఎట్లాగూ! వాళ్ళకు మన యిల్లు కనిపించిందా అసలూ! మనమీది కోపంతో అసలు తిరపతి రావడమే మానేస్తారేమో అనుకున్నా. పోన్లెండి. దేవుణ్ణి చూట్టానికైనా వచ్చారుగద ఇదుగో వస్తున్నా" అంటూ వంటింట్లోంచే చదివేసింది మా తోడికోడలు.

మా బావగారి యింటి వాకిళ్ళన్నీ ఎత్తూ వెడల్పూ లేని చిన్నవాకిళ్ళు. మా అత్తగారు జాగ్రత్తగా తలవంచి, శరీరాన్ని అడ్డంగా తిప్పి లోపలికి రావడం చూసిన మా తోడికోడలు గుమ్మ తేలేసి "ఎవరూ! అత్తయ్యా!" అన్నది ఆశ్చర్యంగా దవడలు నొక్కుకుంటూ.

"ఆ—ఏం! అంత గుర్తుపట్టలేకుండా ఏమైనానూ!" అని కోపంతో దీర్ఘం తీశారు మా అత్తగారు, దిష్టి తగుల్తుందని పమిటకొంగు ఒంటినిండా కప్పుకుంటూ.

"అబ్బే మీకేం కాలేదత్తా... మీ శరీరమే ఏదో..."

"ఆ—నీముఖంలే. త్వరగా వెళ్ళి మరదలి భోజనం సంగతి చూడు..." అంటూ మా బావగారు గుర్రుమని చూశారు మా తోడికోడల్ని.

"ఎందుకట్లా నన్ను గుర్రుమని చూస్తారు? తప్పేవన్నాను! ఒక్కప్పుడు నేను యీ వాకిళ్ళన్నీ పట్టనని మీ కక్క అందరికీ చెప్పి నవ్వలా!..."

"నేనేమీ నవ్వలేదమ్మాయ్..." అంటూ మా అత్తగారు నట్టింటి గుంజకానుకుని "క్రిష్ణా" అంటూ కూర్చున్నారు. మా అత్తగారు చూడకుండా మా బావగారు మా తోడికోడల్ని చూసి పళ్ళుకొరుకుతూ, "అబ్బ... నీనోరు కుట్టి కుదుళ్ళలో పెట్టినా వూరుకోదుగదా! ముందు వెళ్ళి మరదలి భోజనం సంగతి చూడమంటే... అట్లాగే నాకోసం అట్టేపెట్టిన ఆవుపాలున్నాయేమో కక్కకివ్వు యీపూట నాకక్కర్లా..."

"ఎందుకురా! నాకోడలు నాకోసం ప్లాస్కులో తెచ్చింది మా యింటి ఆవుపాలు చాలు. అవున్నాయిగా!"

"ఆమె ఎప్పుడొచ్చినా, మనింట్లో పచ్చి మంచినీళ్ళుకూడా ముట్టకూడదనే ఏర్పాటుతోనే వస్తుందిలెండి... రావమ్మా, చెల్లెలా! భోంచేద్దాం..." అంటూ నా చేయి పట్టుకుని వంటింటివేపు పిల్చుకెళ్ళింది

జమ్మి వారి "లివర్ క్యూర్"

పసిబిడ్డల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులకు
క్రమమైన నెలవారి కార్యక్రమం.

పసిపాపల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులకు మా ఖాయదారులసుఖ, సౌఖ్యముల నిమిత్తము, మా డాక్టరుగారు యీ క్రింది ప్రదేశములలో ప్రతినెల నిర్ణీతమైన తేదీలలోను, గంటలలోను, తగిన సలహాలిచ్చుటకై హాజరులో నుండగలరు.

స్థలము	తేదీ	వేళ	అడ్రసు
నెల్లూరు	6	ఉ॥ 9-11	అజంతా హోటల్, ట్రంకురోడ్.
సికిందరాబాద్	8	ఉ॥ 9-12	తాజ్ మహల్ హోటల్, సరోజినీదేవిరోడ్.
హైదరాబాద్	9	ఉ॥ 9-12	న్యూతాజ్ మహల్ హోటల్, సుల్తాన్‌బజార్.
తెనాలి	12	ఉ॥ 9-11	కన్యకాపరమేశ్వరి సత్రం.
గుంటూరు	14	ఉ॥ 9-11	మెసర్సు మెడికల్ స్టోర్సు, కొత్తపేట.
మచిలీపట్నం	16	ఉ॥ 9-11	మెసర్సు ఆనంద ఫార్మసీ, కెమిస్ట్సు, మెయిన్ రోడ్.
రాజమండ్రి	19	ఉ॥ 9-11	మెసర్సు ఈశ్వరదాస్ & కంపెని, జాండు కం॥ ఏజెంట్లు, 3/101 ఇన్నిస్‌పేట.
భీమవరం	20	ఉ॥ 9-11	మెసర్సు ప్రసాద్ సన్సుఅండ్‌కం, కెమిస్ట్సు,
జంషడ్‌పూర్	15	ఉ॥ 9-11 సా॥ 4-6	సిటీ కెమిస్ట్సు, సాక్చి.
ఖరగ్‌పూరు	4	ఉ॥ 9-11 సా॥ 3-5	మెసర్సు యునైటెడ్ మెడికల్ స్టోర్సు, కెమిస్ట్సు & డ్రగిస్ట్సు: ఎస్. టి. ఇ. 155, రైల్వే మార్కెటు.

జమ్మి వెంకటరమణయ్య & సన్సు,

బ్రాంచీలు:

* శ్రీ ఎన్. హరీశ్వరరావు బిల్డింగ్సు, 17/283-హిందీవిధి, గాంధీనగర్, బకింగ్‌హాంపేట పోస్టు, విజయవాడ-2. * ఒరుగంటివారి వీధి, విజయనగరం సిటీ, * 132/1, మహాత్మాగాంధీ రోడ్, కలకత్తా.

పండుగ ముగ్గులు

కల్యాణప్రసాదశర్మ (విజయనగరం)

మా తోడికోడలు.

"ఊ—యిన్నేళ్ళొచ్చినా నీ పెళ్ళాం దాని బుద్ధి పోనిచ్చిందకాదురా నరం," అన్నారు మా అత్తగారు తన బుద్ధి పోనివ్వకుండా.

మా బావగారు మాట సర్దుతూ, "ఆ దానిమాటలకేంలే కక్కా! నీకు తెలీందేముందీ! ఒట్టిపిచ్చిది నోరుందని వాగడమేతప్ప దానికి మనసులో ఏమీ వుండదు. ఒట్టిబోళా" అన్నారు - ఎప్పుడూ పెళ్ళాన్ని వెనకేసుకొస్తుంటాడని మాబావగారంటే గూడా మా అత్తగారికి కొస్త కోపం లేకపోలేదు మనసులో.

"ఏమో నాయనా—మా తోడికోడలు పోయినప్పుడే యీ యింటికి నాకూ ఋణం తీరింది. తోడికోడలయినా సొంత అక్క కంటే ఎక్కువగా చూసేది. అన్నట్లు నీకొడుకేడీ!"— అంటూ మాటమార్చారు మా అత్తగారు—

"వాడికి వరంగల్ లో వుద్యోగమైంది కక్కా! వాడు వెళ్ళి అప్పుడే రెండు నెలలయింది. యిల్లు దొరగ్గానే కోడల్నీ, మనవణ్ణీ తీసుకెళ్ళి అబ్బాయిదగ్గిర దిగవిడిచి రావాలి—"

"అట్లాగా! అన్నట్లు నీ మనవడేడ్రా! నిద్రపోయాడా!

"అవును కక్కా—వాడికి వారంరోజుల నుండీ దగ్గూ జలుబూ పట్టుకుని వదలడంలా— పాపం చాలా ఢీలా అయినాడు బిడ్డ— చూస్తావా!"

"ఇప్పుడెందుకురా బిడ్డని నిద్రలేపడం! రేపొద్దున్న చూడొచ్చులే. ఇంతకూ వాడికి అబ్బపోలికొచ్చిందా, అమ్మపోలి కొచ్చిందా," అంటూ చిక్కు ప్రశ్న వేశారు మా అత్తగారు.

మా బావగారు నవ్వి "అందరూ తాత పోలికే వచ్చిం దంటున్నారు కక్కా!" అన్నారు.

"అ—అట్లాగే కాకొపట్టండి మీ కక్కని. అవ్వపోలి కొచ్చిందంటే రేపు వాడికి ఒపూట అన్నంకూడా పెట్టదావిడ." అని అంగుకుంది మా తోడికోడలు భోంచేసి ఆకుమడుస్తూ—

మా బావగారు భయపడిపోయారు. మాటమారుస్తూ— "కక్కా పాలఫ్లాస్కు కార్లోవుందా, లోపలికి తెచ్చాడా,"అంటూ వెళ్ళి సామాన్లదగ్గిరున్న ఫ్లాస్కూ, పండ్లూ, గ్లాసూ తెచ్చి మా అత్తగారి ముందు దక్షిగా వుంచారు మా బావగారు.

"ఆ, యిప్పుడే ఎందుకురా. కాసేపుండి తీసుకుంటాలే." అన్నారు మా అత్తగారు.

"తీసుకో కక్కా! ఒంటిపూట భోజనం. పాలు కూడా వేళకు తీసుకోకపోతే, పెద్దతనంలో నీరసంగా వుంటుదూ,"—అంటూ మా బావగారు కాసేపు బ్రతిమాలిన తర్వాత,

(44-వ పేజీ చూడండి)

★ అత్తా తోడికోడలీయం ★

(21-వ పేజీ తరువాయి)

మెల్లిగా ముందుంచిన పండ్లూ, పాలూ, పక్షపాతం లేకుండా పుచ్చుకున్నారు మా అత్తగారు.

మా తోడికోడలూ నేనూ భోంచేసి తమలపాకులపాందానుతో సహా వచ్చి మా అత్తగారి పక్కనే కూర్చొన్నాం. మా అత్తగారు మా తోడికోడ లొచ్చేల్లోపుగానే అరటిపండ్ల తొక్కలన్నీ పక్కనేవున్న మంచం కిందికి తోశారు. మమ్మల్ని చూస్తూనే "కృష్ణా" అంటూ నేలమీదనే కాస్త నడుంవాల్చారు.

"అదేమిటమ్మాయ్ కిందపడుకున్నారు. పక్కనే మంచంవుందిగా," అన్నది మా తోడికోడలు

"ఆ ఈకట్టె నెక్కడ పారేస్తే ఏంలే"- అన్నారు విరక్తిగా మా అత్తగారు.

"ఇన్నాళ్లూ మీ ఒళ్లు కట్టే. కాని యిప్పుడట్టా కాదే. పాపం పెద్దతనంలో వాతంవస్తే...అవస్తే..." అన్నది అసాధ్యురాలైన మా తోడికోడలు. మా బావగారు వూరుకోమంటూ మా అత్తగారు చూడకుండా నెత్తి బాదుకున్నారు.

"నాకు వాతంరాలేదూ—అవస్థా పట్టంలేదు. నేనెప్పట్లాగే వున్నా. అయినా తెలీకడుగుతాగానీ, వచ్చినప్పట్నుంచీ నా ఒళ్లును గురించీ వాతాన్ని గురించీ చదువుతున్నావేమిటా గ్రంథం!" అన్నారు బాగా 'హీ' టెక్కిపోయిన మా అత్తగారు.

"ఆ-ఆనాడు నా లావును గురించి దేశం అంతా చెప్పి మీరు నన్నెగతాళి చెయ్యాలా!" అన్నది అక్కసు కడుపులో పెట్టుకున్న మా తోడికోడలు.

"నేనేమీ దేశం అంతా చెప్పలేదు. చూసేవాండ్లకు కండ్లు లేకపోతేగా!"

"కండ్లున్నవాళ్లెవ్వరూ నేను లావుగా వున్నానని ఏనాడూ అన్లేదు—"

"అయితే ఏమిటే నువ్వనేది! నాకండ్లు లేవంటావా! పండ్లు లేవంటే ఒప్పుకుంటాను. దాందుంపదెంచ కండ్లుకూడా లేవంటే ఎట్టాచచ్చేదీ! యీరోజు జబ్బచేసి నువ్వు చిక్కిపోయావేమోగాని మొదట్నుంచీ నువ్వు లావనేసంగతి అందరికీ తెలిసిందేగా!"

"అదుగో ఆమాటే నే నడుగుతున్నా- మొదట్నుంచీ మీఒళ్ళు కట్టెలావున్నా, యీగోజు పెట్టెలా వుందని చూసేవాళ్ళందరికీ తెలీదాంట? నన్ను చూసి నవ్వినవాళ్ళే యీరోజు మిమ్మల్ని చూసి నవ్వడం లేదాంట..."

"నవ్వితే నవ్వనీ. నీచేత మాటలు పడమని భగవంతుడు నాముఖాన రాశాడు. తప్పతుందా!"—

"నాచేత మీరేం మాటలు పడలేదమ్మాయ్. అన్నిమాటలూ నేనే మీచేత బడ్డాను. మా పుట్టింటివాళ్ళు గతిలేనివాళ్ళన్నదీ మీరే. మా పుట్టింటివాళ్ళకు శుచీ, శుభ్రం తెలీదన్నదీ మీరే—

మా వియ్యాలవాళ్లని తిట్టిపోసిందీ మీరే—

నా కోడలికి ముక్కు సొట్టన్నదీ మీరే.— నా మొగుడు నామాట విని చెడిపోయాడన్నదీ మీరే—

నేను గయ్యాళిననీ, రాక్షసిననీ ఆడిపోసుకుందీ మీరే......"

"ఆగిపోయావేం...! ఇంకా చదువూ. నీనోటి కడ్డేముందీ! ఎన్ని అభాండాలయినా వేస్తావ్.."

"నేనేం అభాండాలు వేయడకలా... ముఖం వుంది, అద్దం వుంది. అనలేదని ప్రమాణం చెయ్యండి..."

"మధ్య నేనెందుకే ప్రమాణం చెయ్యడం. పాపం ఎక్కడుంటే భయం అక్కడుంటుంది. నాకేం!"

"మరి భయంలేనప్పుడు ప్రమాణం చేయడానికేం!" అన్నది లాయరు కూతురైన మాతోడికోడలు.

మా బావగారికోసం వెతికాను... కనిపించలా. ఇద్దరూ కెచ్చిపోతున్నారు. అప్పటికే భయపడుతూనే "వూరుకోండత్తా" అన్నాను. ఆమాట అంటానికి అంతవరకూ నాకు 'ఛాన్సు' యివ్వలా వాళ్లిద్దరూ.

"నన్నూరుకోమంటావేమిటే! అదట్లా నోరుపారేసుకోడం బాగుందా! అసలిందుకే యీ కొంపకు రావడం అంటే నాకిష్టం వుండదు. ఏనాడు మా తోడికోడలు పోయిందో ఆనాడే యీ యింటికీ నాకూ ఋణం తీరిపోయింది."

మా తోడికోడలు వూరుకోలేదు.

"హా యబ్బ.... తోడికోడలుండగా యిద్దరికీ మహా సరిపడ్డట్టు. హాయ్యో సంబడం! ఎవరికి తెలీగు!" అంటూ సాగదీసింది మా తోడికోడలు.

"తెలిసే తెలిసిందిలేవే. నా తోడికోడలైనా, మేనత్తైనా ఆవిడే గనక, ఓ మాటన్నా పడుండేదాన్ని. నీలాగా నా తోడికోడలు అత్తను అడుపులు పట్టించలేదు."

"అదుగో ఆమాటే అనొద్దంటా. అత్తను నేనా అడువులు పట్టించాను! మొగుడు చచ్చిన ఆడబడుచును నానా అవస్థలూ పెట్టి అడుక్కుతినేట్టు చేసింది నేనాంట."

"నేనేం అడుక్కు తినమని పంపలేదు. అడుక్కుతినే బుద్ధులుండేవాళ్ళే అడుక్కుతింటారు. ఇంతకూ దానిపిల్లని నీ పుట్టింటివాళ్లలో యిచ్చుకుందనేగా దాన్నింతగా వెనకేసుకు రావడం?"

"నేనేం వెనకేసుకురాలా. ఆవిడ్నాగతి చేసినందుకు వూరూ, నాడూ అనుకుంటేనూ......"

"హా యబ్బ... నువ్వు అత్తను పెట్టిన అగచాట్లు ఎవ్వరూ అనుకోనట్టు..."

"మీలాంటివాళ్లు తప్ప ఎవ్వరూ అనుకోలేదు మంచానబడ్డ ఆవిడికి నేను చేసిన చాకిరీ వూరందరికీ తెలిసిందేగా! నిజం నిలకడమీద తెలుస్తుంది..."

"ఆ - తెలుస్తుంది. నీనోటికి భయపడితే, తెలీకేంజేస్తుంది?"

పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్ని, మీ సరియైన దర్యనుగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోసు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేది, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదిలగాయతు 12మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము. ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము (వి పి చార్జిలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri. Raj Jyotishi (WP-13) Jullundur City.

"అదుగో మళ్ళీ ఆ మాటే అనొద్దంటూ, నానోరు, నోరు అంటారే. మీ నోటికి భయపడం దేవరు! మీ పేరంటేనే మా పుట్టింటివాళ్ళు హడిలి చస్తారాయిరే!"

"నా పేరంటేగాదేవ్, నీ పేరంటేనే నాపుట్టింటివాళ్ళు భయపడి చస్తారు. ఎందుకీ సిగ్గులేని మాటలు పోనిస్తూ...... ఎవరైనా వింటే నవ్విపోతారు.. ఎవరికి తెలీదు! ఎవరి నోరెట్లాంటిదో!"

"అందరికీ తెలుసు," అన్నది మా తోడికోడలు చేతులు తిప్పుతూ. ఇంక లాభం లేదని "నువ్వైనా వూరుకోవమ్మా—" అంటూ మా తోడికోడలు చేయిపట్టుకొని లేవదీసి వంటింటివేపు తీసికెళ్ళాను. మా తోడికోడలి కోడలు మా అత్తగారి దగ్గర కూర్చుని "వూరుకోండవ్వా..." అంటూ బ్రతిమాలింది. అంతా సద్దుమణిగాక బయటనుంచి మా బావగారు పిల్లిలాగా లోపలికొచ్చారు. తెల్లారుగట్ల మూడింటికే లేచి వేడినీళ్ళు పెట్టింది మా తోడికోడలు మా స్నానాలకు. అప్పటికే స్నానం, గీనం ముగించుకుని మా బావగారు డ్రైవర్ని నిద్రలేపడానికి వెళ్ళారు. రాత్రిజరిగిన దెబ్బలాట పూర్తిగా మర్చిపోయి మా అత్తగారూ, తోడికోడలూ ఎంతో ఆప్యాయంగా మాట్లాడుకోడం చూసి నేనూ, మా తోడికోడలి కోడలూ విస్తుబోయాం.

తీరా బయల్దేరేటప్పుడు మా బావగారితోబాటు మా తోడికోడలు కూడా వస్తే బాగుంటుందనిపించింది. కాని చంటిపిల్లాణ్ణీ, కోడల్నీ ఒంటరిగా విడిచిపెట్టి ఎట్లా వస్తుంది. పోనీ కోడల్నీ, పిల్లాణ్ణీ కూడా కొండకు పిల్చుకెడితే! అయినా నేనుగా మాతోడికోడల్ని కూడా రమ్మని పిలిస్తే మా అత్తగారికేం కోపం వస్తుందోనని నోరు మూసుకూరుకున్నాను. తీరా బయల్దేరే ముందు "ఏమండోయ్ పిల్లాడివి, అబ్బాయివీ కొన్ని ముడుపులు అట్లాగే వున్నాయి. తీసుకెళ్ళి హుండీలో వేస్తారా లేకపోతే రేపు మనం వెళ్ళినప్పుడు వెయ్యొచ్చంటారా!"

"పోనీ మనంవెళ్ళినప్పుడే వేద్దాం. కోడలూరి కెళ్ళేలోగా మనం ఎటుతిరిగీ కొండకోసారి వెళ్ళాలిగా!"

"పోనీ పిల్లాడికి మొక్కుబడి వుంటే నీ కోడల్నీ, పిల్లాణ్ణీ కూడా తీసుకురారా," అన్నారు మా అత్తగారు.

"ఆ ఎందుకులే కక్కీ. మీకు లేని పోని యిబ్బంది. పైగా అవ్వదగ్గిరుంటం బాగా అలవాటయింది వాడికి"

"పోనీ దాన్నీ కూడా రమ్మన్నా. అందరం కలిసే వెళ్ళొద్దాం. మళ్ళీ మళ్ళీ వెళ్ళడం ఎందుకూ? ఎటూ రేపొచ్చేస్తాంగా!"

"దానిష్టం కక్కా—" అంటూ తప్పుకున్నారు మా బావగారు.

"మధ్య నాయిష్టం ఏమిటండోయ్! పోనీ వారంరోజుల తర్వాత వెళ్ళేది యిప్పుడే వెడదాం పదండి," అన్నది మా తోడికోడలు. 'బ్రతుకు జీవుడా' అనుకున్నాం అంతా ప్రయాణమయ్యాం.

కార్లో చోటుంటుందా వుండదా అన్న సందేహం అందరికీ కలిగిందిగాని ఎలాగో సర్దుకూర్చున్నాం. నేను మా అత్తగారికీ తోడికోడలికీ మధ్య కూర్చున్నాను. మా తోడికోడలిపక్కనే, పసిబిడ్డను ఒళ్ళో పెట్టుకుని, కోడలు కూర్చుంది. ముందు సీట్లో మళయాళం పక్కన మా బావగారు కూర్చున్నారు. నిండుగావున్న సామాన్లతోనూ, మనుషులతోనూ గర్భిణీస్త్రీలా బయల్దేరింది కారు.

"కక్కీ! చుక్కలపర్వతం గాలిగోపురం చూశావా యిక్కణ్ణుంచి కనబడుతుంది. అదుగో ఎడంవైపు లోయలో."

"ఓయబ్బ, లక్షసార్లు చూశాను" అని మా అత్తగారు అంటూండగానే ఢాం అంటూ పేలింది మళ్ళీ. "ఓయమ్మ" అంటూ వులిక్కిపడి నన్ను పట్టుకున్నారు మా అత్తగారు.

మా అత్తగారు కూర్చున్నవైపు టైరే మళ్ళీ పంచరయింది. నేను నవ్వాపుకోలేక సతమతమయ్యాను. మళ్ళీ ఏ ఇనపమేకో టైర్లో దిగుంటుంది. లేక టైరే "బరస్టయి" వుంటుంది. అయినా మా అత్తగారుకూర్చున్నవైపే రెండుసార్లూ పంచరుగావాలా! మా తోడికోడలు మూతికి పమిటకొంగు అడ్డం పెట్టుకుని నవ్వుకుంది.

"మళ్ళీ ఏమొచ్చిందే" అన్నారు మా అత్తగారు.

"ఏంరాలేదు. టైరు పంచరైంది" అన్నాను.

"అయ్యో నీటైరు దొంగల్దోలా. యివేం టైర్లూ. యిదేం కారూ. మాట మాట్లాడితే ఢాం ఢాం అంటూ పేలిపోతుందేమిటే

★ అత్తా తోడికోడలీయం ★

విధవకారూ" అని విసుక్కుంటూ మాతో పాటు కారు దిగారు మా అత్తగారు.

"టైరు పంచరయితే కాలేం జేస్తుంది కక్కా! మరో స్పేర్ టైరు వేసుకోవోయ్" అన్నారు డ్రైవర్‌తో మా బావగారు. డ్రైవర్ భయపడుతూ నించున్నాడు. నా గుండె గతుక్కుమంది. అన్నట్లు వున్న స్పేర్ టైర్ కాస్తా మొదట పంచరయినప్పుడే వేసేడు. ఏంచేయడం!

"చూస్తూ నిలబడతావేం డ్రైవర్" అని గద్దించారు మాబావగారు. విధిలేక నేనే చెప్పాను. బయలుదేరిన వెంటనే ఒక టైరు పంచరైందనీ అప్పుడు వేసిన స్పేర్ టైరే యిప్పుడు పంచరైందనీ.

"అట్లాగా. సరే అయితే, ఏదైనా బస్సొస్తుందిగా ఇప్పుడు! అందులో మనం అంతా కొండకెళ్దాం. కారిక్కడేవుంచి, యీపని పిల్లాణ్ణి కాసేపు కారుకు, కాపలావుండమని డ్రైవర్ను దిగువ తిరుపతికి పంపించి టైర్లు రిపేరు చేసుకురమ్మంటే సరి" అంటూ కార్లోవున్న సామాన్లన్నీ కిందికి దించారు మాబావగారు.

"అబ్బే, ఆపాతబస్సు ఎన్నడూ ఇట్టా పంచరూ గాలేదూ, పాడూగాలేదు" అన్నారు మా అత్తగారు రోడ్డుపక్కనున్న బండమీద కూర్చుంటూ.

"అందుకనేగా ఇప్పుడు మీ కోసం బస్సులో పోబోతున్నాం," అన్నది మా తోడికోడలు నవ్వుతూ.

"ఆ–మా కాలంలో బస్సులు గాకపోతే ఈ కార్లన్నీ ఎక్కడున్నాయిలే" అన్నారు మా అత్తగారు.

"మా పెదనాన్నకు కారుండేది. చిన్నప్పుడంతా నేనాకార్లోనే తిరిగేదాన్ని."

"మాకు పెదనాన్నలూ లేరు, కార్లూ లేవు. మానాన్న హయాంలో గుర్రపుసార్టులోనే వెళ్లేవాళ్లం ఎక్కడికి వెళ్ళాలన్నా" అన్నారు మా అత్తగారు మళ్ళీ బిగుసుకుపోయి. మాబావగారికి ఖంగారు పట్టుకుంది.

"ఆ–ఆ–కక్కా వాళ్ల నాన్నకు గుర్రబ్బండీ వుండేదట క్యాంపుల కెళ్లడానికి" అంటూ మా తోడికోడల్ని నోరు మూసుకోమని గుడ్లురిమి చూశారు బావగారు. మా తోడికోడలు నోరు "ఆటోమేటిక్ సిస్టమ్" లో పని చేస్తుంది. ఆవిడొద్దనుకున్నా ఆవిడనోరు ఆవిడ కంట్రోల్లో వుండదు.

"ఏమోనమ్మా. నేనెన్నడూ గుర్రబ్బండ్లూ ఎక్కలేదు, ఒంటెద్దుబండ్లూ ఎక్కలేదు' అన్నది తనూ రోడ్డుపక్కనున్న కొండరాళ్ల మీద కూర్చుంటూ. మా అత్తగారి ఒళ్లు భగ్గున మండింది.

"అదేమిటే! గుంటూరుజిల్లావాళ్లకు గుర్రబ్బండ్లూ, ఒంటెద్దుబండ్లూ గాకపోతే విమానాలెక్కడున్నాయే తిరగడానికి," అన్నారు మా అత్తగారు.

"దానిముఖంలే కక్కా! ఒట్టి బడాయి కోరు," అన్నారు మా బావగారు.

"నేనేం బడాయిలు చెప్పలేదండోయ్. మా క్కారుండేదిగనక చెప్పాను. గుర్రబ్బండీని గుర్రపుసార్టంటూ నేనేంగొప్పలు చెప్పుకోలేదు" అన్నది మా తోడికోడలు.

"అయ్యో శ్రీరామచంద్రా! చిన్నప్పుడంతా అట్టా అనేవాళ్లంగనక యిప్పుడూ పుసిక్కన ఆమాటే వచ్చింది."

"పోన్లేకక్కా! తప్పేముంది.—నువ్వూరుకుంటావా లేదా!" అన్నారు మా బావగారు మా తోడికోడల్ని నమిలిమింగేట్టు చూస్తూ.

"అంటే అన్నదిలేరా! నేనిహ మాట్లాడన్లే. నోరు మూసుక్కూర్చుంటే పోయె" అన్నారు మా అత్తగారు కొడుకును తృప్తి పరచడానికి.

"నీమాటకేం కక్కా! నేనే దీన్నోటికి భయపడి నోరు మూసుక్కూర్చుంటాఒక్కోసారి," అన్నారు మాబావగారు నవ్వుతూ. మా తోడికోడలికి మళ్ళీ కోపం వచ్చేలోగానే, బస్సు వచ్చేసి, మమ్మల్ని బ్రతికించింది.

కొండమీద ట్రావెలర్సు బంగళాలోనే అంతా వుండే ఏర్పాటుచేశారు మా బావగారు.

వెళ్తూనే గుడికెళ్లి స్వామిదర్శనం చేసుకుని, ముడుపులూ, అపరాధ కానుకలు హుండీలో వేసి, పిల్లడి మొక్కుబడికూడా తీర్చుకుని, తిరిగిబంగళాకొచ్చాం. మేమంతా హోటల్నుంచి తెప్పించినభోజనమే చేశాం,

మా అత్తగారుమాత్రం గుడినుంచి అర్చకులు తెచ్చిచ్చిన పులిహోర, దద్ధోజనం, చక్కరపొంగలి, వడలూ వగైరా తీసుకొని భుక్తాయాసంతో క్రిష్ణా అంటూ కాసేపు నడుం వాల్చారు.

ఆమెపక్కనే మా తోడికోడలు కూడా నడుం వాల్చింది. నేను, మా తోడికోడలి కోడలూ పిల్లాణ్ణి నిద్రపుచ్చి ఏమీతోచక స్వామివారి రోజాతోట చూట్టానికి బయలుదేరాం. తోటంతా గులాబీపూలు విరబూశాయి. కాని కోయడానికి లేదుగా! కోసినా పెట్టుకోడానికి అంతకన్నా వీల్లేదు. మా యిద్దరి ఆడహృదయాలు ఆ పూలు చూసి అల్లాడిపోయాయి. అప్పటికి పెద్దపెద్ద పూలన్నీ విడిచిపెట్టలేక కోశాం.

కాని భయంవేసింది—ఆ పూలన్నీ మాల కట్టి, మేంవుండే గదిలోవున్న వెంకటేశ్వర స్వామి పటానికే వేద్దామనుకున్నాం. పూలుకోసినందుకు 'అపచారం' అంటూ చెంపలేసుకుంటూ తిరిగి బంగళాకొచ్చాం. ఈలోపుగా మా అత్తగారూ, తోడికోడలూ ఏఘట్టంలో వున్నారోనని భయపడుతూనే వచ్చాం.

కాని తీరా బంగళాకొచ్చి, వాళ్లిద్దర్నీ చూసి, మా కండ్లని మేమే నమ్మలేక పోయాం, "కలయో! వైష్ణవమాయయో" అన్నట్లు. మా అత్తగారూ మాతోడికోడలూ పడీపడి నవ్వుతూ, "ఫోండత్తా" అంటే "ఫీ ఫోగాడిదా" అనుకుంటున్నారు. మమ్మల్నిద్దర్నీ చూసి "రాండే కోడళ్ళూ, మీకు తొందర్లో పప్పన్నం పెట్టే ఏర్పాట్లు చేస్తున్నాం,—" అన్నారు యిద్దరూ ఏకకంఠంతో—

అంటే మా తోడికోడలి అన్నకొడుక్కి మా అత్తగారి పెద్దక్క రెండవ మనవరాల్ని యిచ్చేట్టు, వాళ్లిద్దర్లో ఒప్పందాలు జరిగి పోయాయన్నమాట.

"మరి కట్నంమాటా ?" అన్నది మా అత్తగారు.

"ఆ కట్నమూలేదు, కాకరకాయా లేదు. మీరుండండత్తా. మా అన్నను నేను ఒప్పిస్తాను. పరాయివాళ్ళం గనకనా! అంతా బీరకాయపీచేగా!" —అన్నది మా తోడికోడలు.

"అంతేలే. అయినా వున్న ఆస్తంతా మా అక్క యింకెవరికిస్తుంది? ఆ యిద్దరు మనవరాళ్లకేగా!— అయితే పెళ్ళి కొండ మీదనేగా."

"ఆహా—మా అన్నపిల్లల పెళ్లిళ్ళన్నీ కొండమీదనే—"

"ధన్యోస్మి. ఎవరా అదృష్టవంతులు!— ఏమి నాభాగ్యంబు!... మీరిరువురూ కలిసి ఒకానొక శుభకార్యంబు తలపెట్టుట అపూర్వం, అద్భుతం, ఆశ్చర్యం!

పరా: ఆలస్యం అమృతం విషం... ఆశుభకార్యం శీఘ్రో సత్వరంబు కానిండు," అన్నారు మా వెనకనించి వచ్చిన బావగార్లు

"అదేమిట్రో నరం...నాటకం భాష మాట్లాడుతున్నావ్!" అన్నారు మా అత్తగారు నవ్వుతూ.

"అవును కక్కా! నిజంగానే, నేను నాటకంలో 'బుస్సీ' వేసి ఒక్కో అరుపు అరుస్తుంటే, హాల్లోవుండే జనంఅంతా హడిలి



నారసింహ లేహ్యము

బంగారుతో చేరినది. మేహము, ఏక్షాక, విస్తృత్తుప వగైరా హరించి బలము రక్తవృద్ధికల్గించును 40 తు డబ్బీ రు 1-4-0 పోస్టేజిరు 1-1-0

ఓ. వి. ఎ. అండ్ కంపెనీ ఆయుర్వేద వమాజం, పెరిదేపి (PO) నెల్లూరుజిల్లా,

చచ్చేవాళ్లనుకో. పిల్లలు పాలుతాగడం మానేసి, గోలగా ఏడ్చేవాళ్లు కక్కా!" అని మా బావగారు చెబుతుంటే మేము నవ్వకుండా వుండలేకపోయాం.

"ఎట్లాగూ! అయితే మరి నీ పెళ్లాంచేత గూడా ఒకవేషం వేయించలేకపోయావుట్రా," అన్నారు మా అత్తగారు నవ్వుతూనే.

"ఆ-నాముఖాని కదొక్కటే తక్కువ," అంది మా తోడికోడలు, మూతి ముడుచుకుని.

"అబ్బె. నాటకాల్లో సొంతపెళ్ళాం పక్కనుంటే నటన రాణించదు కక్కా! అయినా నా పెళ్ళాం నిత్యజీవితంలో కొంకలుతీరిన కథానాయకేగాని నాటక రంగానికి ఆముఖం కొత్త." అంటూ మా బావగారు మా తోడికోడల్ని ఏడిపించడం మొదలెట్టారు.

"పోనెండి, మా ముఖాలన్నీ ఎందుకెస్తాం!"

"ఆ నీదంతా చోద్యమే మరీనూ, వాడేదో ఎగతాళికంటేనూ.."

"ఆయీ రోజు ఎగతాళికంటం గాదులే. ఎప్పుడూ వుండే. ఆయన అందానికీ, రంగుకూ నేను తగనని, తను అనేదిగాక, అందరిచేతా అనిపించాలా!"

"నువ్వే చెప్పు కక్కా! నా అందానికి, ఆ కొంతానికీ యిది ఏమాత్రం తగదని నా పెళ్లప్పుడు అందరూ అన్నదేగా," అన్నారు మా బావగారు పెళ్ళాన్నేడిపించడంలో ఒళ్ళుమర్చిపోయి.

"ఆ-ఎవరిమాట దాకానో ఎందుకూ! యీ మీకక్కే అంది," అన్నది మా తోడికోడలు.

"నేనేమీ అన్లేదమ్మోయ్" అన్నారు మా అత్తగారు ఖంగారు పడుతూ.

"ఆ అనకేం లెండి. అన్నీ అన్నారు. మా చెల్లెలి పెళ్ళికొచ్చినప్పుడు మా పెరట్లో వున్న సపోటా చెట్టుకింద కూర్చుని మీరూ మీ తోడికోడలు మాట్లాడుకోలా! నేను మీ అబ్బాయి కేమాత్రం తగననీ, మా వంశం అంతా అనాకారనీ."

"ఏమిటే మహా చూసినట్టు, విన్నట్టూ మాట్లాడుతున్నావ్. అహా. తెలీకడుగుతా గానీ, నీ యింటికొచ్చి పట్టుమని ఓపూటైన వుండనీ నేను, మీ పెరట్లో వున్న సపోటా చెట్టుకింద తీరిగ్గా కూర్చో వచ్చానంట మరి అభాండాలు వేయడం నీ కలవాటుగాక పోతేనూ" మా బావగారు మెల్లిగా అక్కణ్ణుంచి జారుకున్నారు.

"నేనేం అభాండాలు వేయడం లేదమ్మోయ్ అని లేదంటం మా వంశంలో లేదు" అన్నది మా తోడికోడలు.

"ఆ. ఏం వంశమో మాయదారి వంశం పోనిద్దూ" అన్నారు మా అత్తగారు మూతి మూడు వంకలు తిప్పి మా తోడికోడలు తారాజువ్వలా లేచింది.

"మాది మాయదారి వంశం. సరే ఒప్పుకున్నాను. మళ్లీ ఆ మాయదారి వంశంలో పిల్లాడే ఎందుకొక్కవల్సి వచ్చాడూంట మీ అక్క మనవరాలికి" అంటూ నిలదీసింది మా తోడికోడలు.

"నాకెవ్వరూ కావలసిరాలేదు తల్లీ ప్రస్తావనొచ్చింది గనక అన్నాను. నీకూ నీ వంశానికి ఒక్క నమస్కారం" అంటూ మా అత్తగారు శరీరాన్ని ఒక్క ప్రదక్షిణ చేయించి లేచి లోపలికెళ్లారు. మా తోడికోడలు కూడా లేచి నిలబడ్డది. "నా వంశానికేం నిక్షేపంలాంటి వంశం ఎటొచ్చీ ఖర్మం జాలక మీ రాక్షసివంశంలో వచ్చి పడ్డానే గాని..."

మా అత్తగారు లోపల్నుంచి అందుకున్నారు!

ఎవరిదే రాక్షసి వంశం! ఎవరిదంట. బలవంతంగా అత్తను బకెట్లో కూర్చోబెట్టి భావిలో దించింది ఏ రాక్షసే!"

"హయ్యొ హయ్యొ, మీ అన్యాయం కూలం. యింత అన్యాయమా! తల్లి మాటలు విని నన్నన్యాయంగా బకెట్లో పడేసి భావిలో దించింది మీ అబ్బాయా! నేనా"

"వాణ్ణెందుకంటావే నోర్లేని ధర్మరాజు"

"ఆ—మీ నోరుకాస్త అరువిస్తారని."

"నీనోటి ముందు నానోరేం పనికొస్తుందే. నా వంశాన్నంతా పాడలగొట్టిన నోరు నీది."

"మీ కౌరవవంశాన్ని పాడలగొట్టడం ఎవరి చేతవుతుందీ. పాడిలిచస్తారు. నే నొక్కత్తెనే మొండికెత్తాను."

"కౌరవవంశం మీదిగాని మాది గాదేవ్. మాది నోర్లేని పాండవ వంశం."



★ అత్తా తోడికోడలీయం ★

"మరి ఆ కౌరవవంశంలో వాడి మెడకే మీ పాండురోగపిల్ల నెందుకు అంట గట్టాలని చూస్తున్నారు."

"మా పిల్లకు పాండురోగమూ లేదు, మీ ఉబ్బసపిల్లాడి కివ్వనూ యివ్వం" అంటూ మా అత్తగారు మళ్ళీ లోపలికెళ్ళారు.

"మీ పిల్లాడికి ఉబ్బసమూ లేదు. మీ దిక్కుమాలిన సమ్మంధం మా కొద్దనూ వద్దు" అంటు మా తోడికోడలు కూడా లోపలికెళ్లి పోయింది.

గాలివాన వెలిసింది! కాని అన్యాయంగా కుదిరిన సమ్మంధాన్నీ, కాబోయే పెళ్ళినీ వీళ్ళిద్దరూ పోట్లాడుకుని చెడగొట్టారే అని బాధపడ్డాను. మా బావగారు మెల్లిగా లోపలికొచ్చారు.

ఆయనకు టైమింగ్సు బాగా తెలుసు ననిపించింది. ఆ ప్రాంతాల్లోనే వుండి వుంటా రంత వరకూ. ఉన్నట్టుండి మా అత్తగారు సామానంతా తెచ్చి హాల్లో పడేస్తూ, "బయిల్దేరవే. ఇంక దీనిముఖంజూస్తూ యిక్కడొక్కక్షణం వుండను" అన్నది.

మరోవైపునుండి బట్టలసంచీ, పిల్లాడు ఆడుకునే బొమ్మలూ అన్నీ తీసుకుని వచ్చి హాల్లో పడేస్తూ. "బయల్దేరండి ఇంక యీమాటలు పడుతూ ఒక్క క్షణం వుకడలేను" అన్నది మా తోడికోడలు.

మా బావగారు తలబట్టుకుని కూర్చున్నారు.

నేను మా తోడికోడల్ని ప్రతిమాలి ప్రయాణం మాన్పించే సరికి తాతలు దిగొచ్చారు. మా తోడికోడలి కోడలు చిన్న పిల్లయినా ఎంతో యిదిగా మా అత్తగార్ని ప్రతిమాలి, తెల్లారుగట్ల సుప్రభాతం చూసిపోదామని నచ్చచెప్పింది దగ్గర కూర్చోని.

ఆ రాత్రి నిద్రపోయేదాకా మా అత్తగార్ని,మా తోడికోడల్ని, ఒకచోట చేరకుండా నేనూ, మా తోడికోడలి కోడలూ చెరొకళ్ల దగ్గిరా కాపలావుండాల్సొచ్చింది.

సుప్రభాతానికి వెళ్లడానికి తెల్లారుగట్ల రెండింటికే లేచాం—

పిల్లాడిఏడుపూ, మా తోడికోడలి జోల పాటా, మా అత్తగారి గోవిందనామాలూ కలిసిన నేపథ్యసంగీతంతో స్నానాలు ముగించుకొని, అందరికంటే ముందే గుడి దగ్గిరికెళ్ళాం.తలుపులుతీయడానికి కాసేపూ; అర్చకులకోసం కాసేపూ కాచుకున్నాం "కౌసల్యా సుప్రజారామా"అని ఆరంభిస్తూనే మా అత్తగారు మైకంవచ్చి పడిపోయారు. అందరం ఖంగారుపడిపోయాం.. అంతకుముందునుంచీ కడుపులో వికారంగా వుందంటూన్న మా తోడికోడలుకూడా తల తిరుగుతోందని పడిపోయింది. ఇద్దరూ ఒక్కసారిగా అట్లాపడిపోవడంచూసి, అందరం నోటమాట లేకుండా కొయ్యబారి పోయ్యాం...

"ఏదో అపచారం జరిగివుంటుంది"... అని అక్కడున్న వాళ్లంతా అనుకోడం వినిపించింది.

"అసలే వాతశరీరాలూ, పైత్యతత్వాలూ. తెల్లవారుఝామున లేచేసరికి, నిద్రచాలక మరికాస్త పైత్యించాయి శరీరాలు"అంటూ కాసిని చన్నీళ్లు యిద్దరి ముఖంమీదా చల్లారు మా బావగారు.

కాసేపటికి యిద్దరూ మెల్లిగా లేచి కూర్చున్నారు. ఒకళ్ల ముఖాలు ఒకళ్లు చూసుకున్నారు. "అపచారం వెంకన్నా, అపచారం జరిగింది నాయనా" అంటూ రెండు చెంపలూ ఫెళ్లుఫెళ్లున కొట్టుకున్నారు మా అత్తగారు.

"అపచారం వెంకట్రమణా! అపచారం అయింది తండ్రీ!" అంటూ ఫెడేల్ ఫెడేల్ మని కొట్టుకుంది రెండు చెంపలూ మా తోడికోడలు. 'దీని భావమేమి తిరుమలేశ' అన్నట్లు మేమంతా వాళ్ళిద్దర్నీ చూస్తూ వుండిపోయాం.

"చూశావంటే, పదరవాకే, పదరవాకే అంటే వింటావా! మనం ఎన్నుకుంటే ఏం. మాటిచ్చాం వెంకన్నకు. ఆయనూరుకుంటాడా! కొండమీద పెళ్ళిచేద్దాం అనుకున్నామా, లేదా."

"అవును; అనుకున్నాం," అన్నది మా తోడికోడలు నీరసంగా తలూపుతూ.

"నీ యిష్టం వచ్చినట్లు వాగావు. యిప్పుడైనా తెలిసిందా! వెంకన్నకు కోపం వచ్చిందే" అన్నారు మా అత్తగారు.

"అదే; అదే; నేనూ ఆమాటే అనుకున్నా. లేకపోతే ఎన్నడూలేంది నేనిట్లా తలతిరిగి పడిపోవడమేమిటే" అన్నది మా తోడికోడలు—

"పోనీలే, యిదీ ఒకందుకు మంచిదయింది. ఆ పెళ్ళేదో త్వరగా కానివ్వండి" అన్నారు మా బావగారు నవ్వుతూ.

"ఏమే ఏమంటావ్!" అన్నారు మా అత్తగారు.

"నేనంటానికేముందితా! అంతా అదుగో ఆ ఏడుకొండలవాడి దయ!—వెళ్తునే మా అన్నకు జాబువ్రాసి, శుభలేఖలు వేయించమంటాను"—అంటూండగానే సుప్రభాతం అయిపోయింది. బంగారు వాకిలికి వేసిన తెర తొలగించారు.

"గోవిందా గోవింద" అంటూ అందరం శ్రీనివాసమూర్తి దర్శనం చేసుకున్నాం.

కొండదిగి వచ్చినంతసేపూ—కాబోయే పెండ్లికి దూరాభారంలో వుండే బంధువుల్ని ఎవరెవర్ని పిలవాలో, ఎవరొస్తారో, ఎవరురారో మొదలయిన విషయాలన్నీ మాట్లాడుతూనే వచ్చారు మా అత్తగారూ,తోడికోడలూనూ.ఆరోజువాళ్లింట్లో వుండిపొమ్మని ఎంతో ప్రతిమాలింది మా తోడికోడలు—మా అత్తగారు మెత్తబడ్డారు. బాబోయ్, నా గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. వాళ్ళిద్దరితోనూ దినగండం నూరేండ్లాయు షుసమాచారం. మళ్ళీ అగ్ని పర్వతాలు బద్దలుగాకముందే, అక్కణ్ణుంచి బయటపడాలనిపించింది. మా బావగారికీ అదేభయంలా వుందిపాపం! ఎందుకు లేవే. మళ్లీ పెళ్లికివస్తారుగా" అన్నారు మమ్మల్ని సాగనంపుతూ. అన్నట్లు మేం గనక ఆరోజు అక్కడ ఆగితే ఆపెళ్ళికూడా మళ్ళీ ఆగిపోతుంది అని నాభయం. ఇంక జన్మలో మావారు లేకుండా తిరుపతి వెళ్ళడం అట్టే క్షేమంగాదనిపించింది.

ఇంటికొచ్చిన వారంరోజులకల్లా పెండ్లి పత్రికలొచ్చాయి. మా అత్తగారి ముఖం సంతోషంతో చాటంతయింది.

"ఏమైనా, ఎన్నన్నా, ఒక్క నోరుతప్ప విడిచి, దాని మనసు మంచిదే" అన్నారు మా అత్తగారు. ఈమాటే మా తోడికోడలి ఎదురుగాఅంటే ఆవిడెంత సంతోషించేది.

మొత్తానికి రెండుగ్రహాలు కలిసి శత్రుస్థానంలో చేరినట్లు, మాఘమాసంలో జరగబోయే పెండ్లికి మళ్ళీ మా అత్తగారూ, తోడికోడలూ ఒకచోట కలుస్తారు. ★

ఓం శ్శాంతిః శ్శాంతిః శ్శాంతిః!

ఆంధ్రప్రదేశ్ ఏజంట్లు
మెసర్సు సీతారామాంజనేయ స్టోర్సు ఏజెన్సీస్
విజయవాడ, సికిందరాబాదు.